క్లుప్తంగా

ఘనంగా ఆలయ వజ్రోత్సవాలు


షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయ వజ్రోత్స వాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రవిప్రసాద్ ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వంగపండు జోగినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు సన్యాసినాయు డు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి


చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

తెర్లాం: చిన్నారులకు వ్యాధులు సోకకుండా తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల కేంద్రంలోని సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి, ఏఎన్‌ఎం అన్నామణి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి స్వాతి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్–5లో చిన్నారులకు శనివారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ క్రమం తప్పకుండా చిన్నారులకు టీకాలు వేయించడం ద్వారా ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, హెల్పర్ లక్ష్మి, ఏఎన్‌ఎంలు సరోజినమ్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

చెత్తను ఆరుబయట పారబోయవద్దు


బొద్దాంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: చెత్తను ఆరుబయట, వీధికాలువల్లో పారబోయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని మహిళలకు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం, అంతకాపల్లి, పొగిరి, కంచరాం తదితర గ్రామాల్లో శనివారం ఉదయం ఆయన పర్యటించారు. క్లాప్ మిత్రలు ఇంటింటి నుంచి చేపడుతున్న చెత్త సేకరణను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక మహిళలకు పలు సూచనలు చేశారు. తడి,పొడి చెత్తను వేర్వేరుగా బకెట్లలో వేసి క్లాప్ మిత్రలకు అందించాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నేర ప్రవృత్తిని వీడండి


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

బొబ్బిలి: రిమాండ్ ఖైదీలు పరివర్తన పొందాలని, తమ ఆలోచనల్లో నేర ప్రవృత్తిని వీడాలని న్యాయ సేవా సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ సూచించారు. స్థానిక సబ్ జైలును శనివారం ఆయన సందర్శించారు. రిమాండ్ ఖైదీలకు న్యాయ విజ్ఞానం అందించేందుకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. తోటి ఖైదీల పట్ల వివక్ష ప్రదర్శించకూడదన్నారు. వివక్ష చూపే వారికి పడే శిక్షల గురించి తెలియజేశారు. అనంతరం జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. లీగల్ క్లినిక్‌ను సందర్శించే న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్ల విధులపై ఆరా తీశారు. సబ్ జైల్లోని ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ప్రశ్నించారు. వంటగది,భోజన శాలను, స్టోర్ రూంలోని నిత్యావసరాలను పరిశీలించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

జామి: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం అయిన శ్రవణ నక్షత్రం, శ్రావణ పౌర్ణమి, శనివారం సందర్భంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణగావించి, విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు.

నిధులు లేక నిలిచిన నిర్మాణాలు..!

- వంతెనల నిర్మాణాలకు జరగని బిల్లుల చెల్లింపులు
- పారాది,భోజరాజపురం వంతెనల నిర్మాణాలపై నీలినీడలు
- అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు


పారాది వద్ద పిల్లర్ల దశలో నిలిచి పోయిన వంతెన పనులు


భోజరాజపురం వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన పనులు

బొబ్బిలిరూరల్: నియోజకవర్గంలో వంతెనల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వంతెనల నిర్మాణాలపై ప్రజలకు రోజురోజుకీ ఆశలు సన్నగిల్లితున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశాఖపట్నం– రాయఘడ అంతః రాష్ట్ర రహదారిలో పారాదివద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారు. అలాగే భోజరాజపురం, ఇట్లామామిడిపల్లి, నాయుడువలస మీదుగా రామభద్రపు రం మండలానికి చేరుకునేలా భోజరాజపురం వద్ద మరో బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేతులమీదుగా శంకుస్థాపనలు జరిగాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటిలో పనులు జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పారాది వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బేబినాయన మరో మారు శంకుస్థాపన చేశారు.

చిల్లిగవ్వ అందక..

పారాది వద్ద వేగావతినదిపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయగా, కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.13 కోట్లకు పెంచింది. సంబంధిత కాంట్రాక్టరు పనులు ప్రారంభించి తొమ్మిది పిల్లర్ల నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టా రు. దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. రూ.3.50 కోట్లకు బిల్లులు పెట్టగా నేటికీ ప్రభుత్వం నుంచి చిల్ల గవ్వ అందలేదు. దీంతో పనులు మందగొడిగా సాగుతున్నాయి.నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తవుతాయన్న నమ్మకాన్ని స్థానికు లు కోల్పోతున్నారు. పాత వంతెనపై ఎప్పటి నుంచో రాకపోకలు నిలిచిపోగా పక్కనే తాత్కాలిక కాజ్‌వే ఏర్పాటు చేశారు. వర్షాకా లంలో వేగావతికి ఉధృతంగా వరదలు వస్తే ఈ కాజ్‌వేపై నుంచి రాకపోకలు నిలిచిపోతాయి. త్వరగా వంతెన నిర్మిస్తే తప్ప తమ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదని పారాది, తదితర గ్రామాల ప్రజలు అంటున్నారు.

చేసిన ఖర్చు రూ.3కోట్లు...చెల్లించింది సున్నా

బొబ్బిలి నుంచి భోజరాజపురం, ఇట్లామామిడిపల్లి, నాయుడువలసల మీదుగా రామభద్రపురం మండలానికి చేరుకునేందుకు వేగావతి నదిపై భోజరాజపురం వద్ద వంతెన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.15 కోట్లు నిధులు మంజూరు చేసింది. అప్పటిలో నే కాంట్రాక్టరు పనులను ప్రారంభించారు. ప్రభుత్వం మారినప్పటికీ పనులను ఆపకుండా చేపట్టారు.దాదాపు రూ.3కోట్ల వరకు ఖర్చు చేసి పది పిల్లర్లను నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించకపోవడంతో పనులను నిలిపివేశారు. వేగావతి నదికి నీటి ప్రవాహం పెరిగితే భోజరాజపురం తదితర గ్రామాల ప్రజలు బొబ్బిలికి చేరుకోవాలంటే రామభద్రపుం మీదుగా దాదాపు 15 కిలోమీటర్ల ప్రయాణించాల్సి ఉంటుంది. వంతెన నిర్మాణం పూర్తయితే తప్ప తమ కష్టాలు తీరవని, ఏటా వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని భోజరాజపురం, ఇట్లామామిడిపల్లి, నాయుడువలసల తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

రాజాం సిటీ: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి నిలబెట్టుకోవాలని మండల కార్మిక సంఘాల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. బొబ్బిలి రోడ్డులోని వాటర్ ట్యాంకు ఆవరణలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికుల శ్రమను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పేరుతో ప్రభుత్వం దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాలు ఇవ్వకపోగా సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటించడం దారుణమన్నారు. కార్మికులందరినీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం మండల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనీల్, సభ్యులు మరియదాస్, మోహన్, కృష్ణ, నర్సింగరావు, ప్రసన్నలక్ష్మి, రాజు, శారద,తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ అంటే ఇదేనా..?



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం

బొబ్బిలి: గతంలో బీజేపీ ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రి జస్వంత్ సింగ్ పార్లమెంటులో మాట్లాడుతూ బ్యాంకుల ఈక్విటీల్లో ప్రభుత్వ వాటా 51 శాతానికి తగ్గదన్నారని, కానీ ఇప్పుడు ప్రధాని మోదీ చర్యలతో ఆ వాటా 15 శాతానికి పడిపోయిందనీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం విమర్శించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ చెప్పిన ఆత్మనిర్భర్ భారత్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. హర్షద్ మెహతా మొదలుకుని మన దేశంలో రుణాలతో బ్యాంకులను బురిడీ కొట్టించిన కార్పొరేట్ శక్తుల సంగతి తెలిసినప్పటికీ ప్రధాని మోదీ ఇంకా కార్పొరేట్లకు బ్యాంకులను కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఇన్వెస్టర్లకు బ్యాంకుల్లో వాటాలను పెంచితే వారికి బ్యాంకులపై పెత్తనం పెరుగుతుందని, తద్వారా బాంకుల్లో సాధారణప్రజలు దాచుకున్న కోట్ల రూపాయల డిపాజిట్లు వారి చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ, ఇతర సమస్యలపై బ్యాంకర్లు ఈనెల 11న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు తాము బేషరతుగా మద్దతునిస్తున్నట్టు ప్రకటించారు. సీఐటీయూ నాయకులు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను మరువొద్దు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

రాజాం సిటీ: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను మరువొద్దని, అలాగే వారి జీవితచరిత్రపై అవగాహన అవసరమని సారథి విజయ కోదండరామ ఆశ్రమ అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి అన్నారు.స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తితోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని చెప్పారు. ఈపోటీల్లో విజేతలకు ఈనెల 15న స్వాతంత్య్ర వేడుకల్లో బహుమతులు ప్రధానం చేయనున్నామని చెప్పారు. వికాసతరంగిణి సమన్వయకర్త వాకచర్ల పైడిరాజు, యువ వికాస్ అధ్యక్షుడు గడే అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


ఆదివాసీల వేషధారణలో విద్యార్థులు


బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మెంటాడ: మండలంలోని ఆంధ్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం జి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గిరిజన నాయకుడు, స్వాతంత్య్ర సమర యోధుడు ,ఆదివాసీ యోధుడు బిర్సా ముండా చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.హెచ్‌ఎం కృష్ణారావు మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని, గిరిజన విద్యార్థులంతా శ్రద్ధగా చదువుకోవాలని, హక్కులను సాధించుకోవాలని అన్నారు.ఆదివాసీల హక్కులు, సంస్కృతీ, సంప్రదాయాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.ఉపాధ్యాయులు సతీష్, లోతుగెడ్డ సర్పంచ్ భీమారావు, వైస్ సర్పంచ్ పైడుపునాయుడు,మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రజియా, జోగయ్య,శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాగునీరు అందించేదెప్పుడు..?

- మండల సర్వసభ్యసమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు
- సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి: ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

రాజాం సిటీ: తోటపల్లి కాలువ ద్వారా సాగునీరందక మండలంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో సంబంధిత శాఖల అధికారులు చెప్పాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించారు. సాగు నీటి వనరులు, వ్యవసాయం, వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతోపాటు విద్యుత్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ తదితర శాఖలపై చర్చజరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ పంటలకు ఈపాటికే తోటపల్లి కాలువ ద్వారా సాగునీరందించాల్సి ఉన్నప్పటికీ ఇంకా నీరు విడుదల చేయకుండా అధికారులు ఎందుకు కినుకవహిస్తున్నారని నిలదీశారు. వరి వెదలు, నాట్లు ఎండిపోతున్నాయని, నీరందకపోతే ఈ ఏడాది రైతులు పంటలు సాగు చేసేదెలా అని ప్రశ్నించారు. సమావేశానికి తోటపల్లి అధికారులు రాకపోవడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఎంపీడీఓ శ్రీనివాసరావు సభ్యులకు బదులిచ్చారు. మండలంలో యూరియా,ఇతర ఎరువుల కొరత ఉందని, వ్యవసాయాధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు యూరియా కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రోజూ తిరగాల్సిన దుస్థితిని తీసుకువచ్చారని మండిపడ్డారు. బయట మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి యూరియా, డీఏపీ తీసుకున్నప్పటికీ దుకాణ యజమానులు గుళికలు తీసుకోవాలని మెలిక పెడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీల్లో నిధులు లేవని, ఏ పనులూ చేయలేకపోతున్నామని పలుగ్రామాల సర్పంచ్‌లు సభకు వివరించగా.. ఎంపీడీఓ స్పందిస్తూ త్వరలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయని చెప్పారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ సిబ్బందిని సభ్యులు కోరారు. సమావేశానికి అతిథిగా హాజరైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని చెప్పారు. సమస్యలను మండల అధికారులు పరిష్కరించలేకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల సునీత, మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు నేత్రవైద్యశిబిరం

బాడంగి: జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు ఇన్‌చార్జ్ సీహెచ్.వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శివాలయం పక్కనున్న మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం కొనసాగనుందని పేర్కొన్నారు.స్థానికులతో పాటు మండల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కళ తప్పిన చెరువులు


గెడ్డవలస సమీపంలో ఎండిపోయిన సాగునీటిచెరువు

రాజాం: మండలంలో సాగునీటి చెరువులు వేసవిలో మాదిరిగా ఎండిపోయి జలకళ తప్పాయి. వరుణుడు ముఖం చాటేయడంతో సాగునీటి చెరువుల్లో నీటి జాడ కరువైంది. కంచరాం, ఆగూరు, దోసరి, బొమ్మినాయుడువలస, ఇల్లంనాయుడువలస,గెడ్డవలస, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో సాగునీటి చెరువుల్లో కాస్తో కూస్తో ఉన్న నీరు సైతం ఇటీవల ఎండలకు అడుగంటిపోవడంతో చెరువులు మైదానాల్లా కనిపిస్తున్నాయి.ఈ ఏడాది ఆయా ప్రాంతాల్లో ఖరీఫ్ వరి సాగు అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

రాష్ట్రంలో అరాచకపాలన


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కా ర్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందులలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ గూండాలు దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో పాటు వైఎస్సార్‌సీపీనేతలను తీవ్రంగా గాయపరిచిన టీడీపీ గూండాలను శిక్షించడంలో పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలా కక్షపూరిత రా జకీయాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి న పరిస్థితి టీడీపీకి వస్తుందని హెచ్చరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలుచేయకుండా కూట మి రౌడీ రాజకీయాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని, ప్రజల్లో తిరుగుబాటు మొదలైతే కూటమి నాయకులు క్షేత్రస్థాయిలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని అన్నారు. వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కల్చరల్ వింగ్ కన్వీనర్ డాక్టర్ బి.నరేంద్ర, నియోజకవర్గ మీడియా కన్వీనర్ బట్న వంశీ, నాయకులు నక్కెట్ల అప్పలనాయుడు, కోనారి భవన్నాయుడు, నక్కెట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తమ అన్నయ్యలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అక్క,చెల్లెళ్లకు సోదరులు కానుకలు అందించారు. – సాక్షి నెట్‌వర్క్


రామభద్రపురం: రామభద్రపురంలో అన్న దమ్ములకు రాఖీలు కడుతున్న అక్కా చెల్లెళ్లు


సంతకవిటి: పి.జె.పేటలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్కలు


రాజాం: తనకు రాఖీ కట్టిన అక్కలకు కానుకగా మొక్కలు అందిస్తున్న చిన్నారి


రాజాం సిటీ: పొనుగుటివలసలో తన అక్క చెల్లెళ్లకు మొక్కలు కానుకగా ఇస్తున్న సోదరుడు


బాడంగి: బాడంగి గురుకులంలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి


బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో సోదరుడికి రాఖీ కడుతున్న ఓ సోదరి


బొబ్బిలిరూరల్: అన్నకు రక్షాబంధన్ కడుతున్న చెల్లెలు


తెర్లాం: కుమ్మరిపేటలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క


తెర్లాం: తెర్లాంలో రాఖీ కట్టిన సోదరికి బహుమతి అందజేస్తున్న సోదరుడు